క్లుప్తంగా

త్వరితగతిన భూసమస్యల పరిష్కారం


గ్రామ సభలో మాట్లాడుతున్న గోవిందరావు

టెక్కలి: భూ సర్వే ద్వారా రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సర్వే అండ్ సెటిల్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ రోణంకి గోవిందరావు అన్నారు. రీసర్వే ప్రాజెక్టులో భాగంగా సోమవారం కోటబొమ్మాళి మండలం నారాయణవలస గ్రామంలో రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యూటేషన్ ప్రక్రియ ఆలస్యంగా జరుగుతోందని, ఆన్‌లైన్‌లో భూముల వివరాలు తక్కువగా చూపుతోందని పలువురు రైతులు సభ ద్వారా అధికారులకు తెలియజేశారు. అనంతరం అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూ వివరాలు పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు కావాలన్నారు. అలాగే భూముల స్థితి, వాటి సర్వే నంబర్లు సరి చూసుకుని నమోదు చేయాలని సూచించారు. రైతుల భూ సమస్యలపై తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులకు సంప్రదించండి

టెక్కలి: పశుసంవర్ధక శాఖ హయాంలో ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు, మినీ గోకులాలకు సంబంధించి 2013–14 సంవత్సరం నుంచి 2019–20 వరకు బిల్లులు పెండింగ్ ఉంటే తక్షణమే ఉపాధి హామీ అధికారులను సంప్రదించాలని పశు సంవర్ధక శాఖ డీడీ సీహెచ్ నరసింహులు సూచించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేతనదారులు, మెటీరియల్‌కు సంబంధించి బిల్లుల పెండింగ్ వివరాలతో సంప్రదించాలని పేర్కొన్నారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో శివకుమార్ ప్రతిభ


పతకాలతో శివకుమార్

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన శివకుమార్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీల్లో సత్తా చాటారు. ఈ నెల 27వ తేదీన గుంటూరు జిల్లాలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో బెంచ్ ప్రెస్‌లో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్‌లో రజత పతకాలను శివకుమార్ సాధించాడు.

రచయిత కృష్ణమూర్తికి సత్కారం




కాశీబుగ్గ: శ్రీశ్రీ కళావేదిక 150వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం విశాఖలో ఆదివారం జరిగింది. సమ్మేళనంలో పలాసకు చెందిన రచయిత, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి పాల్గొని 'ఘన సంస్కృతి–మన సంస్కృతి'అనే కవితను వినిపించింది ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, మహిళా అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం తదితరులు కృష్ణమూర్తిని దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

వజ్రపుకొత్తూరు: గోవిందపురం ఉన్నత పాఠశాలలో 1989–1990 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదవిన పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. తోటి మిత్రుడు రవిశంకర్ పాడి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న స్నేహితులు రూ. 30 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా నవరంగాపూర్ బ్లాక్ అంబోదరలో ఉంటున్న అతని ఇంటికి సోమవారం వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మద్దిల హరినారాయణ, బొడ్డేపల్లి మోహన్, కీలు లోకనాథం, పుచ్చ అప్పలస్వామి, జామి మధు ఉన్నారు.

ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని వైశ్య సంఘ నాయకురాలు బోయిన శారదా అన్నారు. కోటబొమ్మాళి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఐ.పుష్పలత అధ్యక్షతన తలగాపు ఝాన్సీ మెమోరియల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మానవ మనుగడ ప్రకృతి పరిరక్షణపై ఆధారపడి ఉందన్నారు. ప్రకృతి పరిరక్షణ–అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యకరమైన భవిష్యత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఎం.సునీత, ఎస్.ఉషారాణి, ఆలిండియా రేడియో గాయకులు కూన భాస్కర్, ఎం.మౌనిక, ఆర్.మేరీ పాల్గొన్నారు.

రోడ్లపైనే తిష్ట వేస్తున్నాయ్..

- రహదారులపై గుంపులుగా సంచరిస్తున్న పశువులు
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు
- స్తంభిస్తున్న ట్రాఫిక్


రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు


రోడ్డుకు అడ్డంగా ఉన్న పశువులు


రాత్రి వేళ మెయిన్ రోడ్డులో సేదతీరుతున్న పశువులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో రోడ్లపైనే పశువులు తిష్ట వేస్తున్నాయి. రాత్రి, పగలనే తేడా లేకుండా యథేచ్ఛగా తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ రోడ్లపైనే పడుకొని సేదతీరుతుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రోజురోజుకూ ఈ పరిస్థితి తీవ్రమవుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యజమానుల నిర్లక్ష్యం..

పశువుల యజమానులు వాటి పెంపకంపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆవుల నుంచి పాలు సేకరించిన తరువాత వాటిని ఇళ్లవద్ద ఉంచకుండా రోడ్లపైకి వదిలేస్తున్నారు. దీంతో అవి విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. వాహనదారులు ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రమాదం బారినపడకతప్పడం లేదు. గతంలో కూడా పశువులను విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలేయడంతో మున్సిపల్ సిబ్బంది స్పందించారు. ఇలా సంచరించే మూగజీవాల కోసం ఓ స్థలాన్ని కేటాయించి అక్కడకు తరలించేవారు. అయితే ఇలా ఉంచిన పశువులకు అవసరమైన మేత, నీరు పెట్టడంతో పాటు వాటిని సంరక్షించడం మున్సిపాలిటీకి కష్టతరంగా మారింది. దీంతో వాటి యజమానులను పిలిపించి రోడ్లపై విడిచి పెట్టవద్దని, తీరుమారకపోతే సమీపంలోని గోశాలకు తరలిస్తామని హెచ్చరించి పశువులను అప్పగించేశారు. ఆ తరువాత కొద్దిరోజులు పశువుల యజమానులు వాటిని రోడ్లపైకి విడిచిపెట్టకుండా జాగ్రత్తపడ్డారు. అయితే కొద్దిరోజులుగా పరిస్థితి మొదటికే వచ్చింది. ఆవులు, ఎద్దులను విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలేస్తున్నారు. ఈ పరిస్థితి పట్టణంలోని మెయిన్‌రోడ్, దినవారిబజారు కూడలి, రథం వీధి, దాసన్నపేట, వీకేపేటరోడ్, ఆర్టీసీ కాంప్లెక్సు సమీపం, బోర్డర్, అమీన్‌సాహెబ్‌పేట ప్రాంతాల్లో వీటి సంచారం ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనాలు ఢీకొని పశువులు కూడా గాయపడుతున్నాయి. ఇప్పటికైన మున్సిపల్ యంత్రాంగం రోడ్లపై సంచరించే పశువులను నియంత్రించే విషయంపై ప్రత్యేక దృష్టిసారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



మున్సిపాలిటీలోఎక్కడి పడితే అక్కడే పశువులు సంచరిస్తున్నాయి. వాటికి కనీస రక్షణలేకుండా తిరగడంతో ప్రజలు, వాహనాలు నడిపేవారు, మూగజీవాలు కూడా ప్రమాదాల బారినపడుతున్నాయి. రోడ్లపై వీటి సంచారం లేకుండా మున్సిపల్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– డి.శ్యామ్‌కుమార్, ఉపాధ్యాయుడు, ఇచ్ఛాపురం

పశువుల యజమానులు సహకరించాలి



రోడ్లపైకి పశువులను విడిచిపెట్టకుండా వాటి యజమానులు తమకు పూర్తి సహకారం అందించాలి. పశువులను రోడ్లపైకి విడిచి పెట్టవద్దని వాటి యజమానులకు చాలా సార్లు అవగాహన కల్పించడం జరిగింది. ఇకపై ఎవరైన రోడ్లపైకి విడిచిపెడితే వాటిని పట్టుకొని గోశాలకు తరలించడంతో పాటు సంబంధిత యజమానికి కూడా జరిమానా విధిస్తాం.

–ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

వంశధార నీటి సాధనకు కృషి


మాట్లాడుతున్న ప్రసాదరావు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గానికి వంశధార నీటిని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని రైతు కుల సంఘం అధ్యక్షులు జన్నెల ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని ఎల్లమ్మగుడి ఆవరణలో బెల్లుపడ గ్రామ రైతులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం వరకు వంశధార సాగునీటిని తీసుకురావడానికి పలాస నియోజకవర్గం వంశధార సాధన కమిటీ సభ్యులను కోరారు. విషయాన్ని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లి వంశధార సాగునీటిని తీసుకురావడానికి ప్రయత్నం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో చిరంజీవులు, కామేష్‌రెడ్డి, మన్మథరావు, బాబూరావు, మాధవరావు, హేమరాజుచౌదరి, తిప్పన కూర్మరెడ్డి, రఘునాథ్, బర్ల ప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి సత్కారం


ప్రదీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సంఘ అధ్యక్షుడుగా గువ్వాడ ప్రదీప్‌కుమార్ ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఫాస్టర్ ఫెలోషిస్ ఆధ్వర్యంలో బెల్లుపడ కాలనీలో ప్రదీప్‌కుమార్‌ను సోమవారం సత్కరించి అభినందించారు. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌లకు ప్రదీప్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

శక్తి యాప్‌పై అవగాహన

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ రాము మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, మహిళా సాధికారత సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనానికి నిధులు కేటాయించండి

టెక్కలి: టెక్కలిలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు బోకర నారాయణరావు, యడ్ల గోపి, బూరగాన బాబూరావు, బోకర మోహన్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేశారు. టెక్కలిలో గతంలో స్థలం కేటాయించారని.. ఆ స్థలంలో భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సాయం



వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామానికి చెందిన డీకే అప్పారావు రైలు నుంచి జారిపడిన ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో ఇద్దరు చిన్నారుల చదువు, పోషణ ఆ కుటుంబానికి భారంగా మారింది. విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ రూ. 20 వేలు సేకరించింది. ఈ మొత్తాన్ని మృతుని భార్య సంధ్యకు సోమవారం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కీలు విజయ్‌కుమార్, ప్రతినిధులు కె.కమల, డీపీ సావిత్రి, మీన, మహాలక్ష్మి, పుష్ప రాధ, డీకే రామారావు, పెంటారావు, సంతోష్, హేమారావు పాల్గొన్నారు. –వజ్రపుకొత్తూరు

పురస్కారం ప్రదానం



టెక్కలికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డి.ఎ.స్టాలిన్ మాస్టార్‌కు శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఉత్తమ కవితా పురస్కారం వరించింది. విశాఖపట్టణంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించిన 150వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో 'వీర సైనికా నీ త్యాగం అమరం'అనే కవితను వినిపించి పురస్కారానికి ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి సభ్యులు అభినందనలు తెలియజేశారు. –టెక్కలి

పేరుకుపోయిన చెత్త!



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం క్షీణిస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 19వ వార్డు లేబరు కాలనీలో రోడ్డుపై చెత్తను విడిచి పెట్టేయడంతో అటుగా వెళ్తున్న వారు కంపును భరించలేకపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కాశీబుగ్గ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన సౌత్ జోన్ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో వజ్రపుకొత్తూరు మండలంలో గల నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. టెన్త్ విద్యార్థి బి.కుమారస్వామి లాంగ్ జంప్ పోటీలలో సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచారు. 4.43 మీటర్లు జంప్‌తో రికార్డు నెలకొల్పాడు. అలాగే 60 మీటర్ల రన్నింగ్ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. మరో విద్యార్థి బి.ఉదయ్ జావిలింగ్ త్రో పోటీలలో సత్తాచాటి ద్వితీయ స్థానంలో నిలిచాడు. వీరు ఆగస్టు తొమ్మిదో తేదీ నుంచి బాపట్లలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. దీంతో పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు, వ్యయామ ఉపాధ్యాయులు పి.గజేంద్ర, శ్రీను, క్రిష్ణారావు, హేమని, నిర్మల, కాళిదాసు, నారాయణ, రమణ, యర్రన్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సూర్యనారాయణకు హనుమా అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న సూర్యనారాయణ

వజ్రపుకొత్తూరు రూరల్: తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన జాతీయ పద్యనాటక ప్రదర్శన పోటీలలో ఆదికవి నన్నయబట్టు నాటకంలో నన్నయబట్టు పాత్రదారిగా నటించిన కణితి సూర్యనారాయణ మాస్టర్ (పలాస) ఉత్తమ కళాకారుడిగా ఎంపికై 'హనుమా'అవార్డు అందుకున్నారు. అలాగే సోమిదమ్మ పాత్రధారిణిగా నటించిన కె.వి. పద్మావతి (విజయనగరం) ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కళాకారులకు నిర్వాహకులు రూ. 50 వేలు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ నాటకానికి కంది త్రినాథ్ సంగీత సారథ్యాన్ని వహించి బెస్ట్ ప్రొడక్షన్‌గా అభినందనలు అందుకున్నారు.


నందిగాం: గిరిజన గ్రామం బెల్లుకొలలో బాబు మోసాలు వివరిస్తున్న ఎంపీపీ రామమూర్తి తదితరులు


కంచిలి: బొనమాళి గ్రామంలో చంద్రబాబు మోసాలతోక ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను అందజేస్తున్న పార్టీ నాయకులు


మందస కేంద్రంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న ఎంపీపీ డి.దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు జానకీరావు తదితరులు


సంతబొమ్మాళి: కొల్లిపాడులో కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి తదితరులు

బాబు మోసాలపై నిలదీయండి


ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురంలో స్థానికుల సమస్యలు వింటున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఎన్నికల హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నాయకులను నిలదీయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం' గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. నిరుద్యోగభృతి, 50 ఏళ్లకే పింఛన్లు, అన్నదాత సుఖీభవ, మహిళలకు నెలకు 15 వందల రూపాయల హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న వైనాన్ని తెలియజేశారు. అలాగే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేకూరిన సంక్షేమాన్ని గుర్తు చేశారు. రెండేళ్లు కరోనా మహమ్మారి పంజా విసిరినప్పటికీ సంక్షేమ పథకాలకు ఆటంకం లేకుండా అమలు చేసిన వైనాన్ని గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. –సాక్షి నెట్‌వర్క్


సోంపేట: రాణిగాంలో క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామావు, ఎంపీపీ నిమ్మన దాస్, తడక యశోద తదితరులు


కంచిలి: బురదపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, సర్పంచ్ పైల తులసీ


పలాస: గరుడఖండిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా నాయకులు పైల చిట్టిబాబు, బమ్మిడి దుర్యోధన తదితరులు


టెక్కలి: పోలవరంలో చంద్రబాబు మోసాలు తెలియజేస్తున్న పార్టీ నాయకుడు హనుమంతు వెంకటేశ్వరరావు


వజ్రపుకొత్తూరు: కొండవూరులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, స్థానిక సర్పంచ్ కొల్లి భాస్కరరావు తదితరులు


కవిటి: సహలాలపుట్టుగలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ నాయకుడు కె.ప్రకాష్ తదితరులు


కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 2, 19వార్డులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శిష్టు గోపి, అంబటి ఆనంద్, బడగల బల్లయ్య


కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో బాబుష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందరరాజు